*ఏ తరగతిలో ప్రేమ జయిస్తుందో చెప్పడం కష్టమే — కాని, మధ్య తరగతిలో ప్రేమలు ఫలించవు. మోసాలే జయిస్తాయి!*

# రామ నీసమానమెవరు?

ప్రకాష్



‘ముందు సీట్లపై దయచేసి కాళ్ళు పెట్టకండి’ అంటున్నది తెరపై స్లైడు. రాము తనకాళ్లు జాగ్రత్తగా చూసుకున్నాడు – పొరపాటున ఎదుటి సీటుపైకి తన కాళ్లు దురాక్రమణకి వెళ్ళలేదుకదా అన్నట్లు. సుశీల కంటి చివరి నుంచి చూస్తూనే వుంది. తను ఎంతో హడావుడిగా సినిమా హాలులో కలుసుకోమన్నా రాము ఎందుకు? అని అడగటం లేదేమిటా అని ఆలోచిస్తుంది. వెంటనే తను జవాబు ఇవ్వటానికి సిద్ధంగా లేదుకదా అని అనుకుంది. తనకు జవాబు తెలుసు కాని, ఎట్లా చెప్పాలో, ఎట్లా చెప్పితే బాగుంటుందో తెలియదు. సినిమాలలో లాగా నీ రూపం నా హృదయంలోనేకాదు, నా కడుపులో కూడా వుంది అని చెప్పాలా లేకపోతే మనిద్దరి మధ్యకు ఇంకొకరు వస్తున్నారు అని చెప్పాలా. సుశీల ఆలోచనలో పడింది.

రాము జాగ్రత్తగా తను సుశీలను చూడటం సుశీల గమనించటం లేదు కదా అన్నట్లు సుశీల వంక చూశాడు. ఇందాకటి నుంచి సుశీల మాట్లాడకపోయేటప్పటికి రాము భయం పెరగసాగింది. అప్పను అదే అయి వుంటుంది. లేకపోతే ఇంత హడావుడిగా తనను పిలచి మాట్లాడమండా వుందంటే అదే అయి వుండాలి. ఇప్పుడు తను ఏం చెయ్యాలి? అసలు తనకు తొందరపాటు ఎక్కువ. సుశీల నోరు విప్పి ఆ సంగతి చెప్పితే తను ఏం జవాబు ఇవ్వాలి? తను చదువుతున్న ఎమ్. ఏ. విలువ అందరికన్నా తనకి బాగా తెలుసు. మామయ్యమీద పేరసైటు తను. తనకాళ్ళమీద నిలబడి సంపాదించుకోలేడు. అటువంటప్పుడు స్వతంత్రంగా సంసారం పెట్టటం అంటే, తనకు సాధ్యమా? దీంతో మామయ్యకు కోపం తెప్పించటమే అవుతుంది. సుశీల ఇంట్లో తమ పెళ్ళికి ఎట్లాగో ఒప్పుకోరు. ఈ సంగతి మామయ్యకు తెలిస్తే ఏమంటాడో? ఏమంటాడో ఏమిటి నా ఇంట్లోంచి బయటకు నడు అంటాడు. ఇన్నాళ్లు నిన్ను ఎందుకు ఇంట్లో వుంచుకుని మేపాను అనుకుంటున్నావు. ఇంకొకళ్ళకి ఇంకొకళ్ళకి కడుపు చెయ్యటానికా – నాకూ తుడుండంగా? ఇప్పుడు నీ గాలికూడా దానికి తగలటానికి వీలులేదు అంటాడు. అక్కడకి రాధ గాలి తగలటానికి తను వుబలాటపడుతున్నట్లు.

మామయ్య గుర్తుకు వచ్చేటప్పటికి రాముకు అప్పడం ముక్క గొంతులో గుచ్చుకున్నట్లయ్యింది. తెరపైకి చూశాడు. ఫలాని చ్యూయింగ్ గమ్ నములుతూ సెంచరీ ఎట్లా కొట్టాడో వివరిస్తున్నాడు గవాస్కర్. వెంటనే రాముకు సుబ్బారావు కరుకుతనం

స్వాంత మేనల్లుడనికూడా చూడని ముక్కు-సూటితనం గుర్తుకు వచ్చాయి.

ఆ రోజు—

శ్రీలంక టీము మీద భారతదేశం ఆడుతున్న క్రికెట్ టెస్టులో రెండవ రోజు. ఆట ఇంకా మొదలు కాలేదు. గవాస్కర్ డబుల్ సెంచరీ చేస్తాడా అన్నది అందరి మనసులలో మెదులుతున్న ప్రశ్న. మొదటి రోజు కొంపదిని మిత్ర బృందం తో బాటు రాముడు. వాళ్ళు రాము స్కూల్లో క్లాసుమేట్లు. రాము కాలేజి దాటి యూనివర్సిటీలో అడుగుపెట్టినా వాళ్ళు కాలేజి దాటే సన్నాహాలు చేయటంలేదు. ఆట చూడటంకన్నా మిగతా వారిని ఆట పట్టించటానికి వచ్చారు. రెండు నిముషాలలో రాము వాళ్ళలో కలిసి పోయాడు. ఆ అల్లరిలో జోరులో చిన్న పిల్లవాడిలా, మిగతా వారిలా జులాయిగా సివిలైజుడు బ్రూట్‌గా తయారయ్యాడు. వేరుశెనక్కలు, అరటిపండు తొక్కలు, అట్టముక్కలు, రాళ్ళు, కర్రముక్కలు - ఒకటేమిటి కానిది కొట్టడానికి అనర్హం అన్నట్లు కింద కూర్చున్నవారిపైకి విసర సాగారు. దెబ్బగట్టిగా తగిలిందా "వాట్ ఏ లవ్లీ షాట్ యార్!" అంటూ అరుపులు కేకలు, ఈలలు, చప్పట్లు.

కింద కూర్చున్న వాళ్ళలో రెండు తరగతులు తయారయ్యాయి. ఒకటి వీళ్ళ చేత దెబ్బలుతిన్న వాళ్లు, రెండు అమ్మయ్య మనల్ని కొట్టడం లేదు అని తృప్తిపడే వాళ్ళు. ఏమిటి మీ ప్రవర్తన అని అడిగే వారు లేకపోయారు. దెబ్బతిన్న వాళ్ళు ఏమాత్రం గొంతు ఎత్తినా అరటిపండు తొక్కలు, ఐస్‌క్రీం దాటి ఎక్కువ చేస్తున్నారు. ఇండియా ఎప్పుడు డిక్లేర్ చేసిందో తెలియలేదు రాముకు.

లంచ్ అయిపోయింది. శ్రీలంక బాటింగ్ మొదలు పెట్టింది. రాము పక్కన కూర్చున్న భూపతి ఎవరూ వినకూడని బూతులతోపాటు, కోతలుకూడా వినిపించ సాగాడు.

"అడుగో డ్రింక్స్ ఇస్తున్నాడే వాడే సురేందర్. ఓ సారి కలకత్తాలో ఆస్ట్రేలియాతో మాచిలో వీడు ట్వెల్త్‌మాన్. అప్పుడు అందరూ ఆటోగ్రాఫు ఇచ్చారు కాని. వీడు పెద్ద పోజు కొట్టాడు. నాయాలా! జీవితాంతం ఇట్లాగే ట్వెల్త్‌మాన్‌గానే ఉండిపోతావురా అని తెలుగులో బూతులు తిట్టాను. అన్నట్లే ఎనిమిదేళ్ళు అయినా ఇంకా ట్వెల్త్‌మాన్‌గానే వున్నాడు. చూడు వాడిని ఏం చేస్తానో అంటూ బెల్ బాటం పాంటు పైకి మడిచాడు.

రాము కుతూహలంగా అటు చూశాడు. కాలి చుట్టూ ఇరవై పాతిక రాకెట్లు నీటుగా కట్టివున్నాయి. అక్రిందటి రోజు రాకెట్లు వదలారని ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవటంతో భూపతికి వాటిని దొంగ రవాణా చెయ్యక తప్పలేదు.

భూపతి రాకెట్టు తీసి సిగరెట్టుతో వెలిగించి వదిలాడు. దాంతో అల్లరిలో ఇంకో అధ్యాయం మొదలయ్యింది. తమని వదిలి పెట్టాడుకదా అని ప్రేక్షకులు కూడా సంతోషించారు.

రాకెట్లు వదలకూడదని రేడియో లో ప్రకటనలు వస్తున్నాయి. సెక్యూరిటీ జనం కూడా పెవిలియన్‌లోకి వచ్చారు. అయినా భూపతి బృందం విజృంభించారు. సందేహిస్తూనే రాము రాకెట్టు వదిలాడు. అది సరాసరి ఫీల్డింగ్ చేస్తున్న సారథి చేతిలోకి వెళ్ళింది. ఆ కంగారులో సారథి దానిని వదిలెయ్యడానికి బదులు ఇంకా గట్టిగా పట్టుకున్నాడు కాబోలు, అతని చేతిలోనే ఇరవై క్షణాలు వెలిగింది.

రాము, భూపతి, తదితరులు ఆనందం నించి తేరుకునేటప్పటికి చుట్టూ పోలీసులు మూగారు. ఇందాకటి నుంచి వీళ్ళ అల్లరి భరించలేనివాళ్ళంతా సహకరించటంతో, పోలీసులు నలుగురిని, పాంటులోవున్న రాకెట్లతో సహా పట్టుకెళ్ళారు. పోలీసు వాన్ ఎక్కబోతూ తల తిప్పిచూశాడు రాము. సుబ్బారావు క్లబ్ సెక్రటరీతో మాట్లాడుతున్నాడు. "ఇప్పుడేమంత ప్రమాదం లేదు కాని, ఐ డోంట్ తింక్ హి కుడ్ ప్లే ఇన్ దిస్ మాచ్."


నోవా బ్రిలియంటైన్ మీ వ్యక్తిత్వాన్ని ఇనుమడింప చేస్తుంది.
అందుచేతనే నేడు లక్షలాది ప్రజలు నోవా బ్రిలియంటైన్ వాడుతున్నారు.

నోవా బ్రిలియంటైన్ వాడండి. మీ జుట్టు చక్కగా అణిగి వుండటం చూడండి. నోవా జుత్తు మొదళ్ళను రక్షిస్తుంది. జిడ్డుగా వుంచదు. నేడే నోవా బ్రిలియంటైన్ వాడటం మొదలు పెట్టండి. నోవా మీ జుత్తును ఆరోగ్యంగాను, ఒత్తుగాను, అందంగాను పెంచుతుంది. శరీరమునకు బ్రాసుకొనుటకు కూడా మంచిది. శీతాకాలంలో మరియు ప్రయాణాలలో మంచి ఉపయోగకరమైంది.

ది నోవా కంపెనీ

లాల్ బహదూర్ శాస్త్రి మార్గ్,

భండూప్,

బొంబాయి-400 078



అంటూనే రాముని చూశాడు. పరిస్థితి అర్థం అయిపోయింది. వీళ్ళెకడూ రాసెట్లు వదిలింది అంటూ క్లబ్ సెక్రటరీ వంక చూసి "అదుగో ఆ జుట్టు పెంచుకున్నాడే వాడే నా మేనల్లుడు. నేను ఇది ఇంకో ఉద్దేశ్యంతో చెప్పటంలేదు. లీగల్‌గా ఎన్ని రోజులు వీళ్ళని జైల్లో వుంచచ్చో అన్ని రోజులు వుండేట్లు చూడండి. దే డిజర్వ్ ఇట్. బెదిరించి వదలటం లాభంలేదు. దే వర్ ఎబౌట్ టు స్పాయిల్ ది కెరీర్ ఆఫ్ ఎ యంగ్ క్రికెటర్" అన్నాడు.

తరువాత రాముకు తెలిసింది. ఎంతమంది చెప్పినా చివరకి జామీనుకు కూడా ప్రయత్నించ లేదని. రాము ఎన్నడూ అనుకోలేదు భూపతికి అంత పరపతి— రెండో రోజున ఇంటికి రాగలిగేంత— వుందని. తరువాత మామయ్యను మంచి చేసుకోవటానికి రాము చాలా కష్టపడ్డాడు. ఏదో స్కూలులో తెలుసు కాబట్టి పక్కన కూర్చున్నానని, తను ఒక్క రాసెట్టు కూడా వదలకపోయినా పొరపాటున పట్టుకున్నారని చెప్పాడు. నాలుగు రోజుల తరువాత ఒక రంజి మాచ్‌లో సారథి సెంచరీ కొట్టాడన్న వార్తను సుబ్బారావుకు చూపించాడు. కాని ఆ మ్యాచ్‌లో ఆడటంవల్ల గాయం పెద్దది అయి సారథి రెండో టెస్ట్‌కు అన్‌ఫిట్ అయ్యాడన్న వార్తను సుబ్బారావుకు చెప్పలేదు.

తన చేతిమీద సుశీల చెయ్యి పడటంతో ఆలోచనలలోంచి తేరుకుని సుశీలవంక చూశాడు రాము.

"రాము నాకు చాలా భయంగావుంది" ఒక్క క్షణం ఆగి అంది" నేను....అవాళ పిక్‌నిక్ గుర్తుందా?..కడుపుతో వున్నాను"

రాము వెంటనే తయారయిపోయాడు. కుడి చేతిని సుశీల భుజాల చుట్టూవేసి అన్నాడు "ఓ డార్లింగ్!"

సుశీలకు కొంత ధైర్యం వచ్చింది. "అదికాదు రాము, ఇప్పుడు మనం ఏం చెయ్యాలి?"

"ఏం చెయ్యాలి పెళ్ళి చేసుకోవాలి" అన్నాడు రాము నవ్వుతూ.

"ఛత్! సీరియస్‌గా మాట్లాడు."

"ఒక విధంగా మనం తప్పు చెయ్యలేదు. అయినా మనం చేసింది తప్పే! ఇది నీ తప్పా నా తప్పా అన్నది కాదు ప్రశ్న. ఇందులో ఇద్దరికీ భాగం వుంది. ఇటువంటి విషయాలు పెద్దవాళ్ళకు చెప్పటానికి కొంత సన్నాహం అవసరం. అంటే ఎట్లా చెప్పితే బాగుంటుంది అన్నది ఆలోచించాలి. ఎట్లా చెపితే వాళ్ళు నొచ్చుకోకుండా అవునంటారా అన్నది మనకు కావలసినది. వాళ్ళు కాదన్నా మనం పెళ్ళి చేసుకుంటాం— అది వేరే సంగతి. కాని వాళ్ళను ఒప్పించగలిగినప్పుడు ఇదంతా ఎందుకు? కాబట్టి మీ డాడీతో, మా మామ.. మీ డాడీతో మీ మమ్మీతో మాట్లాడే విషయం నేను ఆలోచిస్తాను. ఇంకో రెండు మూడు .... కాదు అయిదారు రోజులలో ఈ విషయం తేలిపోతుంది."

ఇద్దరూ ఆ తరువాత తేలికగా సినిమా చూశారు. ఇద్దరిలోనూ టెన్షన్ పోవటానికి కారణాలు అఫ్‌కోర్సు వేరువేరు. ఎంతో బ్రహ్మాండం అనుకున్న సమస్య తేలిపోయింది అని రాము మాటల మెస్మరిజం మత్తులో వున్న సుశీల గత్యంతరం లేదు అనుకున్న దానిని అయిదు రోజుల వాయిదా వెయ్యగలిగాను. ఈ అయిదు రోజులలో అసలు సిసలయిన పరిష్కారం దొరకకపోతుందా అని రాము.

మార్నింగ్ షో అయిపోయేటప్పటికి పన్నెండయ్యింది. శీతాకాలం అవటంతో ఎండ లేదు. ఇద్దరూ చేతిలో చెయ్యి వేసుకుని కొంత దూరం నడిచారు. తమతోపాటు వస్తున్న మౌనాన్ని తరిమివేయటానికి ఏదో ఒకటి మాట్లాడాలికదా అన్నట్లు అంది సుశీల "ఇంకా తాగాలి ఏమిటి బాబూ ఆ సిగరెట్టుముక్క పారేద్దూ!"

సెంటీ మీటరు వున్న సిగరెట్టుపారెయ్యబోతూ ఆగిపోయాడు రాము. మళ్ళీ నోటిలో పెట్టుకుని రెండు దమ్ములు లాగాడు. "చివరిదాకా తాగితే వుండే ఆనందంవేరు" అంటూ సిగరెట్టు చివరిసారి పీల్చి నేల మీద పడేస్తూ ఆటోను పిలిచాడు.

"ఆటో ఎందుకు?" అడిగింది సుశీల.

"పిక్‌నిక్ పోదాం. ఎట్లాగో కాలేజి మానాంకదా ఇద్దరం."

"ఇంతయిపోయాక కూడానా" అంది సుశీల కడుపు వంక చూపిస్తూ. ఆ అనడంలోవున్న సీరియస్‌నెస్ ఆ యాక్షన్‌లో జోకు చేస్తున్నట్లు అనిపించింది.

"రమ్మంటుంటే" అంటూ సుశీల చేయి పట్టుకుని అప్పుడే ఆగిన ఆటోలోకి నడిచాడు.

* * *

తలచుకుంటేనే అదోలా వుంది సుశీలకు. అద్దం ముందు నిలబడి అన్ని కోణాల నించి చూసుకుంది. ఊహు బయటకి కనబడటంలేదు. డ్రసింగ్ గౌన్ లోంచి చేయి పోనించుకుని పొత్తికడుపు తడుముకుంది. తమకంటూ ఒక పాప— ఆ వూహ వస్తేనే థ్రిల్లింగ్‌గా వుంది. రాము ఇంకా మమ్మీతో డాడీతో మాట్లాడలేదు అన్న విషయం గుర్తుకు వచ్చింది. చెయ్యి బయటకు తీసి లెక్కపెట్టింది. రెండు మూడు నాలుగు. అవును అయిదారు రోజులలో కదా రాము మాట్లాడతానంది. అవవలసిన ఫార్మాలిటీస్ అన్నీ అయిపోతే ఏ కంగారూ వుండదు. అసలు ఈ విషయం తెలియగానే

ప్రజాతంత్ర

19-12-76
సంచికలో

* మహాకవి విశ్వనాథ మరణించాడా? (ప్రత్యేక వ్యాసం)
* కారులో మొక్క —కథ
* ఆఫ్రికా సర్పరాజం ఆహారక్రీడ!
* షేక్‌స్పియర్ భగవద్గీత చదివాడా?
* తెలుగు సినిమా కవిత్వంమీద సెన్సారు విధించాలి —సినీతంత్ర.
* సావేరి, రాజు పేద * అనంతం.
* ఇంకా ఇతర విశేషాలు!

ప్రజాతంత్ర,
నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్-500 001.

డాడీ మమ్మీ రియాక్షన్ ఎట్లా వుంటుందో?

తలుపు చప్పుడయ్యింది. విసుక్కుంటూనే వెళ్ళి తలుపు తీసింది. భూమయ్య నుంచున్నాడు నవ్వుతూ. భూమయ్య నవ్వు చూస్తుంటే అనిపించింది రాము వచ్చి వుండాలి అని. ఆనందంగా అడగబోయింది.

"రాము పంపించినారంట" అంటూ పూలగుత్తి అందించాడు భూమయ్య.

ఒక్కసారిగా లాక్కున్నట్లు అందుకుంది సుశీల. తలుపులు మూసి తలుపుకు ఆనుకుని పూలగుత్తి గుండెకు హత్తుకుని నిలబడింది. నునువెచ్చగా, చల్లగా అదోలా వుంది. పట్టరాని ఆనందంతో నీరసం వచ్చినట్లయ్యింది.

వెళ్ళి మంచంమీద కూలబడింది. గుత్తిని పక్కగా వుంచుకుని పడుకుంది. వాసన చూస్తూ కళ్ళు మూసుకుంది. అవును రాము ఏదన్నా రాసి వుండాలే అనుకుంటూ పూలగుత్తి విడదీసింది. అందులో రెండు కాయితాలు వున్నాయి. లేచి కూర్చుని చదవబోయింది.

తలుపు తోసుకుని వచ్చింది సుమిత్ర. చేతిలో పూలు, నీడిల్సు వున్నాయి. అల్లుతూనే వచ్చి సుశీల పక్కన కూర్చుంది.

"ఏమిటి సుశీ! సాయంకాలం బయటకి వెళ్ళలేదు. న్యూ ఇయర్ పార్టీస్ ఏమీ లేవా?" మాట్లాడుతున్నా చేతులు వాటి పని అవి చేసుకుపోతున్నాయి.

సుశీలకు నవ్వు వచ్చింది. రెండు నెలల క్రితం కాబోలు వీళ్ళ క్లబ్‌లో మొదలయ్యింది ఈ పిచ్చి. అప్పటినుంచి మమ్మీ చేతిలో ఇవి లేకుండా చూడటం ఒక్క డైనింగు టేబులు దగ్గరే. అయినా ఎన్ని రోజులు తమిద్దరు కలిసి భోజనం చేశారు కనుక.

"రేమ మమ్మీ! ఇవాళ బద్ధకంగావుంది" అంచి పూల గుత్తి సుమిత్రకు కనబడకుండా తన వెనకాల వుంచుతూ.

"నువ్వు నాలుగు రోజులుగా కాలేజికి కూడా వెడుతున్నట్లు లేదు. అయినా ఒంట్లో బాగుండకపోతే సుబ్బారావు అంకుల్ దగ్గరకు వెళ్ళకపోయావా?" అంది సుమిత్ర.

సుశీల ఏదో చెప్పబోయింది.

సుమిత్ర అర్థంతరంగా లేచింది. "అయ్యో! మరిచిపోయాను. రజని రంగనాథన్ నన్ను పార్టీకి ముందుగా తప్పక కలుసుకోమంది. ఇవాళ వాళ్ళ బంగళాలో న్యూ యియర్ పార్టీ వుంది- రాత్రి పదకొండు నుంచి తెల్లారే వరకు" అంటూ పూలు వుండలు [illegible] డ్రెసింగ్ టేబులు [illegible]న పడేసి హడావుడిగా వెళ్ళిపోయింది.

అమ్మయ్య అనుకుంటూ రజని రంగనాథాన్ని మొదటిసారిగా మెచ్చుకుంది సుశీల. కాయితాలు తీసి చూసింది. ఒకటి హాపీ న్యూ యియర్ అంటున్న కార్డు. రెండోది వుత్తరం కాదు - పాంప్లెట్. రాము ఎందుకు పంపించాడు అనుకుంటూ విప్పిచూసింది. తల తిరగటం ప్రారంభించింది. అట్లాంటి కాయితాలు మమ్మీ దగ్గర చాలా చూసింది అంతకు ముందు. ఏమిటి రాము వుద్దేశ్యం అన్న ప్రశ్న పూర్తి కాలేదు. జవాబు తెలిసిపోయింది. అదికాదు, కాకూడదు అనుకుంటూనే ఆ పాంప్లెట్‌ని పూర్తిగా చదివింది.

'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నన్సీ' ఉద్దేశ్యాలు, అవసరం, ఆ అవకాశాలు ఆ నగరంలో దొరికే హాస్పిటల్సు పేర్లు వున్న పాంప్లెట్ అది. ఒక ప్రముఖ మహిళామండలి విడుదల చేసింది దాన్ని. ఆ మహిళా మండలికి సుమిత్ర కార్యదర్శి.

పుట్టిన ఉత్సాహం, ఆనందం ఆవిరి అయిపోగా సుశీల లేచి నిలబడింది.

రాము ఎందుకు ఇట్లా చేశాడు. అవును రాము మటుకు ఏం చెయ్యగలడు? రాము వాళ్ళ మామయ్య చేతిలో బాండెడ్ లేబరర్ ట. తనతో ఆ మాట చాలా సార్లు చెప్పాడు. ఏదో జోకు అనుకుంది తను. సుబ్బారావు అంకుల్ బయటకి ఎంత మంచిగా వుంటాడో, కొన్ని విషయాలలో అంత నిక్కచ్చి, మొండిట. అయినా ఆయన మటుకు ఏం చెయ్యగలడు? ఉన్న అంద వికారితనం అంతా పోగుచేసినట్లు వున్న రాధకు ఇంకో సంబంధం చూడా



సంప్రదాయ మాధురి

## మందార మకరందాలు

శ్లో॥ ఉద్యమేన హి సిద్ధ్యంతి కార్యాణి న మనోరథైః।
నహి సుప్తస్య సింహస్య। ప్రవిశంతి ముఖే మృగాః॥

యత్నం వలన కార్యములు సిద్ధిస్తాయికాని కేవలం మనోరథం వలన పనులు జరగవు. సింహం నోరు తెరచుకొని పడుకొని వుంటే జంతువులు తమంతటవి వచ్చి నోట్లో పడవుకదా!

కంఠస్థం చేయాలి!

లంటే ఆయన తరమా? ఇప్పుడు తను ఏం చెయ్యాలి?

టకటక బూట్లు శబ్దం చేసుకుంటూ వచ్చాడు రంగారావు. విసుగ్గా చూసింది సుశీల డాడీవంక. తన మనసులో వున్నది చెప్పాలనుకున్న రోజు కనబడరు ఈ డాడీ మమ్మీ. ఇప్పుడు తీరికగా, ఒంటరిగా ఏడుద్దాం అనుకుంటుంటే వస్తారు ఒకరి తరువాత ఒకరు.

"ఎట్లా వున్నావు సుశీ! ఏం లేదు ఇవాళ రాత్రి నేను ఇంటికి రాను. ఆహా! పార్టీ అని కాదు. ఇన్నాళ్ళు వలంటరి డిస్ట్రోజర్ గురించి సీరియస్‌గా తీసుకోలేదు. పొద్దున మన ఇన్‌కంటాక్స్ కన్‌సల్టెంట్ కూడా చెప్పాడు. ఇవాళ చివరి రోజు తెలుసుగా. ఆ పని అయిపోతే తేలికగా వుండవచ్చు. వెడితే ఆ పని అయిపోయాక ఏదన్నా పార్టీకి వెళ్ళచ్చు. నువ్వు ఎక్కడికి వెళ్ళటంలేదుకదా? రేపు పొద్దున మాట్లాడుకుందాం వస్తా."

రంగారావు బయటికి నడిచాడు. సుశీల అప్రయత్నంగా రంగారావు వెనకగా నడిచింది. కారు వెళ్ళిపోయేంతవరకూ హాలులో నిలబడింది.

బంగళా నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దం అంతా ఏదో రాక్షసి అయినట్లు, తనని మింగేస్తున్నట్లు ఫీల్ అయ్యింది. ఒక్కవుదుటున తన గదిలోకి వెళ్ళింది. మంచం మీద కూర్చుని ఆలోచించ సాగింది. ఏం చెయ్యాలి తను? ఆ కాయితం చూశాక ఇదే ప్రశ్న నిముష నిముషానికి అనుకుంటున్నది సుశీల మనసు. ప్రతిసారి ఆ ప్రశ్న ఇంకా భయంకరంగా తయారవుతున్నది.

సుశీల చేతులు అప్రయత్నంగా పూలు వుండలు, నీడిల్సు అందుకున్నాయి. మమ్మీ మొదలుపెట్టినప్పుడు తనకి నేర్పింది. ఒక నిట్టు ఒక పర్లు కదూ

ఇప్పుడు తను ఏం చెయ్యాలి? నిట్టు పర్లు: మళ్ళీ మొదటికి వచ్చింది కథ. అప్పుడయితే రాము సాయం వస్తాడన్న ఆశ వుండేది. ఇప్పుడో అంతా నిరాశ. నిట్టు పర్లు. అసలు రాము వుద్దేశించినట్లే అబార్షన్‌కి ఎందుకు ప్రయత్నించకూడదు? వెంటనే అందులో అపాయం గుర్తుకు వచ్చింది. మమ్మీనే ఇదంతా ఆర్గనైజ్ చేసింది. ఇప్పుడు తను ఏ MTP Centre కి వెళ్ళినా ఫలాని మమ్మీ కూతురు అని తెలిసిపోతుంది. నిట్టుపర్లు బయట ఎక్కడన్నా ప్రయత్నించాలి. క్లాస్‌మేట్ రాగిణి చెప్పింది అక్కడెక్కడో అబార్షన్ చేయించుకున్నానని. ఎక్కడబ్బా! నిట్టు పర్లు. ఆ విషయం చెప్తూ అంది "అనవసరంగా నాలుగు వందలు వాడి మొహాన పోశాను. అంత తేలిక అని నాకు తెలియదు" అని ఆ తరువాత అదేమిటో అందికదూ. నిట్టుపర్లు. తనకి స్వెట్టరు అల్లటం అప్పటికి తెలియదు అనో....నిట్టు....

ఆగిపోయాయి సుశీల చేతులు.

* * *

ఆ మరునాడు దాదాపుగా అనుకున్నట్లు సుమిత్ర, రంగారావు పదింటికి ఒక్కసారే ఇంటికి వచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పాలని సుశీల గదికి వెళ్ళిన ఇద్దరికి సుశీల నిద్రపోతూ కనిపించింది- అది శాశ్వత నిద్ర.

పక్కమీది దుప్పటి, సుశీల ఒంటిమీది గౌన్ రక్తంతో తడిసిపోయింది. కారుకింద నలిగిన మందార పువ్వులా వుంది సుశీల. ఒక చెయ్యి నోట్లో వుంది. బాధ, అరుపు బయటకి రాకుండా పెట్టుకున్నట్టు వుంది. ఎంత బాధపడిందో పళ్ళతో చేతిని గట్టిగా కరవటంతో రక్తంకూడా వచ్చింది. ఇంకో చేతిలో నిట్టింగ్ నీడిలువుంది రక్తంతో తడిసి, నేలమీదవున్న న్యూస్ పేపర్లు కూడా రక్తంతో తడిసి వుండలు వుండలుగా నలిగిపోయి వున్నాయి.

ఏ ఒక్కరు విడిగా ఆ సంఘటన ఎదుర్కోవాలిసి వచ్చినా ఆ తరువాతి పరిణామాలు ఎట్లా వుండేవోగాని, ఇద్దరూ దాదాపుగా అరగంట ఒకరినొకరు ఎవరిని వారు తిట్టుకుంటూ గడిపాక - ఈ సంఘటన ఘనమయిన తమ కుటుంబానికి మచ్చ కాకుండా వుండటం ఎట్లా అన్న ప్రశ్నకు సమాధానంగా వెతకసాగారు. ఇట్లా ఫలాని వారి అమ్మాయి ఎవరితోనో తిరిగి కడుపు తెచ్చుకోవటమే కాకుండా, తనకి తానే అబార్షన్ చేసుకోబోయి చచ్చిపోయింది, అంటే ఎంత తలవంపులు? ఒక నిర్ణయానికి వచ్చి సుబ్బారావుకు ఫోన్ చేశారు. చాలా కాలంగా సుశీలకు గుండె బలహీనంగా వుంటే ఎవరికి తెలియకుండా వైద్యం చేయిస్తున్నామని చెప్పాలి అనుకున్నారు.

సుబ్బారావుతో పాటు రాముకూడా వచ్చాడు. సుశీల దురదృష్టానికి కారణం ఎవరు అన్న ప్రశ్న గురించి ఎవరూ పట్టించుకోకపోవటం తన అదృష్టం అనుకున్నాడు. రంగారావు సుమిత్ర తమ పరువు దాని అవసరం గురించి చెప్పి సుబ్బారావు చేత సహజ మరణమేనన్న డెత్ సర్టిఫికేట్ ఇప్పించారు.

సుబ్బారావు ఇచ్చిన Death Certi-ficate మీద సిరా ఇంకా ఆరలేదు. పోలీసులు వచ్చి సుశీల శవాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుబ్బారావు ఇచ్చినది తప్పుడు సర్టిఫికేట్ అని తెలియటానికి ఎంతోసేపు పట్టలేదు.

సుబ్బారావు మెడికల్ ప్రాక్టీషనర్‌గా డిబార్ అవటానికే కాకుండా, ప్రాసిక్యూట్ చెయ్యబడటానికి చాలా అవకాశాలు వుండటంతో లీడింగ్ డాక్టర్‌గావున్న సుబ్బారావు అది భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు.

తరువాత రాము మామయ్యకు ఇచ్చిన మాటమీది గౌరవంతో రాధను పెళ్ళి చేసుకున్నాడు. అప్పుడప్పుడు ఏదన్నా ఫైవ్‌స్టార్ హోటలులో మధువుతోగాని, మగువతోగాని వున్నప్పుడు రాము అనుకుంటుంటాడు. మామయ్య డెత్ సర్టిఫికేట్ రాస్తున్నప్పుడు తను పోలీసులకు ఫోన్ చెయ్యకపోతే తన జీవితం ఎట్లా వుండేదా అని. ★